సాక్షి వైఎస్ఆర్ జిల్లా

శనివారం। 22। జూన్। 2024



వ్యాధుల కాలం..పశువులు భద్రం

వర్షాకాలం మొదలైతే చాలు మనుషులకే కాదు మూగ జీవాలకు వ్యాధుల ముప్పతప్పదు. పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. -8లో



అతిసార నియంత్రణపై దృష్టి

వైఎస్సార్ జిల్లాను అతిసార రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ విజయ రామరాజు అధికారులను ఆదేశించారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.4/27.4

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 27.4 - 36.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

తగ్గిన పచ్చిమిర్చి ధర

కడప అగ్రికల్చర్: కడప రైతు బజార్‌లో పచ్చి మిర్చి ధర తగ్గింది. మొన్నటి వరకు కిలో రూ. 60 ఉన్న పచ్చి మిరపకాయలు శుక్రవారం కిలో రూ. 35 చేరింది. దీంతో వినియోగారులు కాసింత ఊపిరి పీల్చుకున్నారు. టమాట కిలో రూ. 58 ధర పలుకుతోంది. పిచ్చిమిరప ఘాటు తగ్గినా టమాటాల ధర మాత్రం తగ్గడం లేదని వినియోగదారులు చర్చించుకుంటున్నారు.

కడప రచయిత్రికి అంతర్జాతీయ పురస్కారం



కోడూరు సుమనశ్రీకి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్: కడపకు చెందిన ప్రముఖ నర్తకి, రచయిత్రి కోడూరు సుమనశ్రీకి మలేషియా అంతర్జాతీయ పురస్కారం లభించింది. మలేషియా ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆహ్వానం మేరకు ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు మలేషియాలో జరిగిన భారతీయ కళా ఉత్సవాలలో ఆమె కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మలేషియా ప్రభుత్వ సాంస్కృతిక శాఖామాత్యులు సరస్వతి ఆమెకు పురస్కారం అందజేశారు. సంస్థ ప్రతినిధులు పవన్, రామయ్యలు ఆమెను అభినందించారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కడప ఆర్డీఓ జీఆర్ మధుసూదన్ హెచ్చరించారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా జరగకుండా సిద్ధవటం, ఒంటిమిట్ట, కడప, చెన్నూరు, వల్లూరు తదితర సచివాలయాల్లో రెవెన్యూ, పోలీసు, మైన్స్ అండ్ జియాలజీ శాఖల అధికారులతో కంట్రోల్ రూము ఏర్పాటు చేస్తున్నామన్నారు. వల్లూరు మండలం ఆదినిమ్మాయపల్లె ఇసుక రీచ్‌లో అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తుండడంతో కడప డివిజన్ పరిధిలోని అన్ని సచివాలయాల్లో కూడా కంట్రోల్ రూములను ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు.

'మా అమ్మ ఒడి'లో ప్రవేశాలకు ఆహ్వానం

కడప సెవెన్‌రోడ్స్: కడప నగరం రెవెన్యూ సేవా సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న మా అమ్మ ఒడిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆ సంస్థ కార్యదర్శి త్రిభువన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 30 మందిని చేర్చుకుంటామన్నారు. 5 నుంచి 10 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలన్నారు. అర్హతలు నిర్ణయిస్తూ సంబంధిత తహసీల్దార్ సర్టిఫికెట్ తీసుకుని దరఖాస్తును జతచేసి తమకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అలాగే గార్డియన్ డిక్లరేషన్ కూడా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన పిల్లలకు తొలి ప్రాధాన్యత ఇస్తామని, ఎవరో ఒకరిని కోల్పోయిన పిల్లలకు ద్వితీయ ప్రాధాన్యత ఇస్తామన్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు పిల్లలను చేర్చుకునేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 97044 74874 నంబరులో సంప్రదించాలని సూచించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు విస్తరించాలి



స్కౌట్స్‌కు సర్టిఫికెట్లు ఇస్తున్న డీఈఓ అనూరాధ

వైవీయూ: జిల్లాలోని పాఠశాలల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు చురుగ్గా నిర్వహించాలని, మరింత విస్తరించాలని జిల్లా విద్యాశాఖాధికారి, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ ఎం. అనూరాధ సూచించారు. శుక్రవారం కడప నగరం శంకరాపురంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ కార్యాలయంలోని ఎంటీ .కృష్ణబాబు సమావేశ మందిరంలో తృతీయ సోపాన్ శిక్షణ పూర్తిచేసుకున్న స్కౌట్స్‌కు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజం పట్ల ఉన్న బాధ్యతను భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలియజేస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి డి. ప్రమీల మాట్లాడుతూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లాలో వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు క్రమశిక్షణగా కోర్సు పూర్తి చేశారని తెలిపారు. అనంతరం తృతీయ సోపాన్ పూర్తి చేసుకున్న స్కౌట్స్ కేడెట్స్‌కు సర్టిఫికెట్లు అందజేశారు.జిల్లా కోశాధికారి బి. శివశంకర్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ బి. ఖాదర్‌బాషా, జిల్లా గైడ్స్ ట్రైనింగ్ కమిషనర్ చంద్రావతి, సభ్యులు రాయుడు, అగ్గిరప్ప, వెంకటసుబ్బయ్య, సమగ్రశిక్షా అభియాన్ సెక్టోరియల్ ఆఫీసర్లు సి. విశ్వనాథ్‌రెడ్డి, ధనలక్ష్మి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి పాల్గొన్నారు.

ఫీజులుం



- ప్రైవేటు, కార్పొరేట్‌లో కొనసాగుతున్న దోపిడీ
- నోటీసుబోర్డులో కనిపించని ఫీజు వివరాలు
- విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు బేఖాతర్

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఫీ'జులుం'ఆగడం లేదు. ఎవరికి తోచినట్లు వారు తల్లిదండ్రుల నుంచి ఫీజులను వసూలు చేస్తున్నారు. అడ్మిషన్ ఫీజు మొదలుకుని పలు రకాల పేర్లతో ఫీజుల దోపిడిని యదేచ్ఛగా సాగిస్తున్నారు. ఇదేమని అడిగేవారు కరువయ్యారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఫీజులకు సంబంధించిన వివరాలను నోటీసు బోర్డులో కనిపించేలా ఏర్పాటు చేయాలని నిబంధన ఉన్నా ఏ ఒక్క చోట కూడా ఇది అమలుకు నోచుకోవడం లేదు.ఈ విషయమై ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారి ప్రకటన కూడా ఇచ్చారు. కానీ ఇది ఎక్కడా పూర్తిస్థాయిలో అమలు నోచుకోలేదు. అరకొరగా స్కూళ్లలో ఫీజుల తాలుకా వివరాలను నోటీసు బోర్డులో పెట్టినా ఫీజు వసూళ్ల చేసేది మాత్రం వేరే ఉంటుందని తల్లిదండ్రులు తెలిపారు.అలాగే మా వద్దే పుస్తకాలను కొనుగోలు చేయాలని షరతులు పెట్టడంతో భారమైనా కొనక తప్పడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వ పాఠ్య పస్తకాలను కొనుగోలు చేయాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడం లేదు. కొన్ని యాజమాన్యాలు పిల్లల సంఖ్య ఎక్కువగా ఉన్నా తక్కువగా చూపి నామ మాత్రం పాఠ్యపుస్తకాలను కొనుగోలు చేసి తీసుకెళ్లుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పిల్లలకు చదువే ఆస్తి: పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి చదువు ఒక్కటేనని చాలా మంది తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు పంపుతున్నారు. కొన్ని యాజమాన్యాలు దీనిని అదునుగా తీసుకుని డబ్బులు వసూళ్లు చేసు కుంటున్నారు. పిల్లలు నేడు ఎల్‌కేజీ నుంచి 10వ తరగతికి వెళ్లేసరికి చదువు కోసం లక్షల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి వస్తుందని తల్లిదండ్రులు అంటున్నారు. సామాన్య, మధ్యతరగతికి చెందిన వారు ఏళ్ల తరబడి రెక్కలు ముక్కలు చేసిన సంపాదనంతా పిల్లల చదువకునే ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్భాటం చూసి మోసపోకండి...

ప్రైవేటు, కార్పొరేట్ స్కూలు అనగానే అంతా ఆర్భాటమే, అవరణంతా జిగేల్ మనిపించేలా రంగులు, పాఠశాలలోకి అగుడుపెట్టగానే కళ్లు చెదిర్ ఆఫీస్ క్యాబిన్ ఉంటుంది. పిల్లలకు జాతీయస్థాయి ప్రమాణాలతో విద్యనందిస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసం. ఇవన్నీ నిజమని నమ్మి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ అక్కడ చాలామంది విద్యార్హత లేని ఉపాధ్యాయులు ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు ఇరుకు గదులు, అంతంత మాత్రంగా మంచినీటి సౌకర్యం ఇలా పలు రకాల సమస్యలు పిల్లలను వేధిస్తుంటాయి. ఇవన్నీ తల్లిదండ్రులకు తెలిసినా తమ పిల్లలను కార్పొరేట్ స్కూళ్లలోనే చేరుస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్‌లలో వసతులు లేని విషయాల గురించి విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కొత్త పేర్లతో దోపిడీ: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల నిర్వాహకులు ఒలింపియాడ్, ఈ టెక్నో, కాన్సెప్ట్, ఇంటర్నేషనల్ ఇలా రకరకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను బోల్తా కొట్టిస్తున్నారు.పెద్ద మొత్తంలో ఫీజులు గుంజుతున్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను తమ పాఠశాలలోనే కొనాలని ఆదేశిస్తున్నారు. పాఠశాలలో చేర్పిన రోజే అడ్మిషన్ ఫీజుతోపాటు ఫీజులో కొంత శాతం ఫీజు చెల్లించి, సపరేటుగా పుస్తకాలను కొనుగోలు చేయాలనే నిబంధనలను పెట్టి నిలువు దోపీడీ చేస్తున్నారు.

నిబంధనలకు పాతర...

విద్యాహక్కుచట్టం ప్రకారం అడ్మిషన్ ఫీజు, డోనేషన్లు వంటి వాటిని వసూలు చేయడానికి వీలు లేదు. ఇలా వసూలు చేస్తే పాఠశాల యాజమాన్యానికి జరిమానా విధించవచ్చు. అలాగే పాఠశాల ప్రాంగణంలో పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయించకూడదనే నిబంధనలు కూడా ఉన్నాయి. కానీ ఇవి ఎక్కడా అమలు కావడం లేదు, దీనిని అమలు చేయాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

విద్యార్థి సంఘాల ఆందోళనలు..

ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లతోపాటు పాఠశాలల్లో పుస్తకాలను విక్రయిస్తున్నారంటూ నిత్యం ఏదో ఒక విద్యార్థి సంఘం ఆందోళనలు చేస్తూనే ఉన్నాయి.ఈ విషయంపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. అయినా విద్యాశాఖాధికారులు స్పందించడం లేదని వారు ఆరోపణలు చేస్తున్నారు.

జిల్లాలో ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూళ్ల వివరాలు ఇలా...

పాఠశాల కేటగిరి	స్కూళ్లు	విద్యార్థులు
ప్రాథమిక	258	66287
ప్రాథమికోన్నత	185	27811
ఉన్నత పాఠశాలలు	312	78400
మొత్తం	755	1,72,498

నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాల్సిన అంశాలు..

జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల వారు ఫీజులు, అనుమతి పత్రంతోపాటు పలు వివరాలను నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాల్సి ఉంది.

- తరగతి వారీగా వసూలు చేస్తున్న ఫీజు వివరాలు
- పాఠశాల పర్మిషన్, రిజిస్ట్రేషన్, గడువు వివరాలు
- పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పేరు, వారి వివరాలు వారికి సంబంధించిన జీత భత్యాలు, విద్యార్థుల వివరాలు తెలియ చేయాలి.
- పాఠశాలలో తరగతి వారీగా సెక్షన్ల వివరాలు ఉంచాలి
- పాఠశాల భవనానికి సంబంధించి లీజు లేదా సొంత భవనం వివరాలు తెలపాలి
- ఆటస్థలం వివరాలు, ఫైర్ సర్టిఫికెట్‌కు సంబంధించిన గడువు గురించి రాయాలి. కానీ ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు.

అధిక ఫీజు వసూలు చేస్తే చర్యలు



ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఫీజులకు సంబంధించిన వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలి.పాఠశాలల్లో పుస్తకాలు అమ్మరాదు. వీటిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం. - అనురాధ, జిల్లా విద్యాశాఖాధికారి

నేడు వైఎస్ జగన్ రాక



పులివెందుల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేడు (శనివారం) పులివెందులకు రానున్నారు. శనివారం ఉదయం 11గంటలకు తాడేపల్లి నివాసం నుంచి రోడ్డు మార్గాన గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు. 11.20గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 11.30గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో కడపకు బయలుదేరుతారు. 12.15గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 12.25గంటలకు కడప నుంచి పులివెందులకు రోడ్డుమార్గాన బయలుదేరుతారు. 1.25గంటలకు పులివెందులలోని భాకరాపురంలో గల స్వగృహానికి చేరుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న జిల్లా ఎస్పీ




కోదండరాముని సన్నిధిలో జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి దేవాలయంలో వెలసిన మూలమూర్తులను శుక్రవారం కడప జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు ఆయనకు ఆలయ లాంచానాలతో స్వాగతం పలికారు. గర్భాలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగ మండపంలో వారికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఒంటిమిట్ట సిఐ పురుషోత్తం రాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారాయణ... నారాయణ!

- టీచర్లను వేధిస్తున్న యూనియన్ నేతలు
- ఓ విద్యాధికారి రిటైర్మెంట్ ఫంక్షన్ పేరిట చందాలు
- అమౌంట్ ఫిక్స్ చేసి మరీ వసూళ్లు చేస్తున్న వైనం



సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆయనో మండల విద్యాధికారి. కీలకమైన కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నారు. పదవీ విరమణ సమయం ఆసన్నమైంది. అదే సాకు చూపెట్టి భారీ వసూళ్లకు తెరలేపారు. అందుకు ఉపాధ్యాయ యూనియన్ నేతలు నడుంబిగించారు. రిటైర్మెంట్ ఫంక్షన్ భారీగా నిర్వహించాలంటూ తెరపైకి వచ్చారు. టీచర్లను వ్యక్తిగతంగా కలుస్తూ రూ.2 వేలు తక్కువ లేకుండా ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు. చందా పుస్తకాలు చేతబట్టుకొని మరీ అయ్యవార్ల వద్దకు వెళ్తున్నారు. ఇదేంటీ ఎంత ఇవ్వాలో కూడా మీరే నిర్ణయిస్తారా? అని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దూషణలకు దిగుతున్నారు. సు. దీర్ఘకాలం పనిచేసి రిటైర్డ్ అవుతున్న అధికారిని సన్మానించుకోవడం సముచితమే. పదవీ విరమణ సందర్భంలో అప్పటివరకు అందించిన సేవలకు గుర్తుగా ఆ ఉద్యోగులు వ్యక్తిగతంగా గౌరవించుకోవడం అనవాయితీ. కాగా తద్భిన్నమైన పరిస్థితులను ఉపాధ్యాయ సంఘాల నేతలు తెరపైకి తెచ్చారు. ఎంఈఓగా రిటైర్డ్ అవుతున్న ఓ అధికారికి సన్మానం పేరిట వసూళ్లకు తెరలేపారు. దాదాపు 440 మంది ఉపాధ్యాయులు డగా అందరీతో చందా రాబట్టాలనే దిశగా గుంపుగా వెళ్తూ విడివిడిగా అయ్యవార్లను కలుస్తున్నారు. యూనియన్ నేతల్ని చూసి తలాడించే వారు కొందరైతే, అంతే ఇవ్వాలని డిమాండ్ చేయడం ఏమిటనీ మరి కొందరు నిలదీస్తున్నారు. అలాంటి వారితో గొడవలకు దిగడం యూనియన్ నేతల వంతైంది. మరోవైపు ప్రవేటు పాఠశాల యాజమాన్యాలను సైతం వదిలిపెట్టడం లేదు. జిల్లా విద్యాధికారి, పాఠశాల విద్యా రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఈవ్యవహారంపై దృష్టి సారించి చందాలు పేరిట టీచర్లను బెదిరిస్తున్న యూనియన్ నేతల్ని కట్టడి చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

కడపరాయా..కరుణించవయ్యా



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



అభిషేకం కోసం సిద్ధం చేసిన కలశాలు

ముగిసిన సహస్ర కలశాభిషేకం

కడప కల్చరల్: కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామికి శుక్రవారం కలశాభిషేకం నిర్వహించారు. తిరుమల-తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో స్థానిక అర్చక బృందం టీటీడీ ఆగమ సలహాదారులు విజయ్‌భట్టర్ పర్యవేక్షణలో మూడు రోజుల సహస్ర కలశాభిషేకాన్ని బుధవారం నుంచి ప్రారంభించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి కార్యక్రమాలను సక్రమంగా కొనసాగేందుకు నిరంతర పర్యవేక్షణ చేశారు. ముగింపు సందర్భంగా శుక్రవారం ఉదయం స్వామికి ద్వారతోరణ పూజ, పాలికారాధన, శ్రీచక్ర మండలారాధన, సముద్రాలు, నదుల నుంచి సేకరించిన జలాలతో నింపిన కలశాలకు విశేష అలంకారం చేసి పూజలు నిర్వహించారు. ఆలయ రంగమండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామిని, శ్రీ పద్మావతి అమ్మవారిని కొలువుదీర్చారు. తొలుత పద్మావతి అమ్మవారి మూర్తిని కలశంలోని పవిత్ర జలాలతో అభిషేకించి పరిమళ ద్రవ్యాలను అర్పించారు. అర్చకుల వేద మంత్రోచ్చాటనలు, వెయ్యి కలశాలతో స్వామి, అమ్మవార్లను అభిషేకిస్తున్నంత సేపు ఆ ప్రాంతమంతా గోవిందనామస్మరణతో ప్రతిధ్వనించింది. ఈ సందర్భంగా మూర్తి హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. భక్తులందరికీ కర్పూర హారతులు, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, తివిక్రమ్ బృందం మూడు రోజుల కార్యక్రమాలను దిగ్విజయం చేయడంలో ప్రధానపాత్ర పోషించారు.

జనాలపై.. టైగర్ దాడి


జిల్లా వ్యాప్తంగా వానలు పడుతున్నాయి. దీంతో దోమలు నిద్ర మేల్కొంటున్నాయి..జనాలపై దండ యాత్రకు సిద్ధం అవుతున్నాయి. సీజన్‌లోకి అడుగుపెట్టక ముందే 'టైగర్'దోమ బలాన్ని పుంజుకుంది. ఫలితంగా డెంగీ జ్వరాల కేసులు క్రమంగా పెరుగుతున్నాయి.

- కురుస్తున్న వానలు
- మేల్కొంటున్న దోమలు
- జిల్లాలో ఇప్పటికే 93 'డెంగీ'కేసులు

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా అప్పుడే సీజనల్ వ్యాధులు మొదలయ్యాయి. ప్రధానంగా టైగర్ దోమ వల్ల వ్యాపించే డెంగీ జ్వరాలు చాప కింద నీరులా నమోదవుతున్నాయి. అజాగ్రత్తగా ఉంటే 'డెంగీ'విజృంభించడానికి సిద్ధంగా ఉంది.

'డెంగీ'అంటే...

ఇది సీజనల్ వ్యాధుల కాలం. జనాలు వివిధ రకాల సీజనల్ వ్యాధులకు గురవుతున్నారు. అందులో ప్రధానంగా డెంగీ కేసులు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే అధికారికంగా 91 కేసులు నమోదయ్యాయి. అనధికారింగా మరింత కేసుల సంఖ్య ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మంచి నీళ్లలో జీవించి, పగటి పూట కుట్టే టైగర్'దోమ కారణంగా డెంగీ జ్వరాలు వస్తాయి. కంటి గుడ్లు నొప్పులుగా ఉంటాయి. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వాంతులు అవుతాయి. విరేచనాలు కూడా కావచ్చు. ఇది డెంగీ జ్వరం లక్షణం. డెంగీ జ్వరం ఎప్పుడైనా రావడానికి ఆస్కారం ఉంది. అయితే ఈ టైగర్ దోమ వానాకాలంలో పుట్టుకొస్తాయి. అంటే జూన్ నుంచి అక్టోబర్ వరకు ఈ దోమకు అనుకూలమైన వాతావరణం కలిగి ఉంటుంది. అందువల్ల వర్షాకాలంలో కేసులు అధిక సంఖ్యలో నమోదవుతాయి.



- సాధారణంగా మనిషి రక్తంలో దాదాపు 2 నుంచి 4.50 లక్షల కణాలు (ప్లేట్ లేట్స్) ఉంటాయి. ఈ జ్వరం వస్తే ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గుతుంది. ఫలితంగా తీవ్ర అనారోగ్యానికి గురి అవుతారు. ఈ తరుణంలో సదరు రోగికి రక్తంలో ప్లేట్ లెట్స్‌ను ఎక్కించాల్సి ఉంటుంది.

'సీరం ఎలీసా'పరీక్షల ద్వారా నిర్ధారణ..

వైద్య ఆరోగ్య శాఖ అధికారికంగా సీరం ఎలీసా పరీక్షల ద్వారా డెంగీని నిర్ధారిస్తారు. ఈ పరీక్షలను కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి, పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తారు. కాగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇలా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'ర్యాపిడ్ కిట్స్'ద్వారా డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో పాజిటివ్ వస్తే మళ్లీ 'సీరం ఎలీసా'పరీక్షల ద్వారా నిర్ధారణ చేస్తారు.

ప్రభుత్వ ఆసుపత్రులు..

ఆరోగ్య శ్రీ ద్వారా ఉచిత వైద్యం: సాధారణంగా ప్రైవేట్ ల్యాబొరేటరీలలో డెంగీకి కేవలం రక్త పరీక్షలకే రూ 500 నంచి రూ 1000 వరకు వసూలు చేస్తున్నారు. అదే సదరు వ్యక్తి హస్పిటల్‌లో అడ్మిట్ అయితే 5 రోజులకు దాదాపు రూ 15 వేలకు పైగా అవుతుంది. అదే ఆ వ్యక్తికి ప్లేట్ లెట్స్ ఎక్కించాలంటే ఒక రోజుకు రూ 10 వేల వరకు అవుతుంది. ఒక వేళ ఆ వ్యక్తి ఐసీయూలో ఉంటే ఏడు రోజులకు హస్పిటల్‌కు సంబంధించి అన్ని ఫీజులను కలుపుకుంటే రూ 70 వేలకు పైగా అవుతుంది. కాగా దీనిలో మరణాలు అరుదుగా సంభవిస్తాయని వైద్య ఆరోగ్యశాఖ అంటోంది. కాగా డెంగీ జ్వరాలకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలను పొందవచ్చు.

పరిశుభ్రతతోనే దోమల నిర్మూలన



డెంగీతో పాటు మరికొన్ని వ్యాధులు దోమల కారణాంగానే వస్తాయి. పరిశుభ్రతను పాటిస్తే దోమలను నిర్మూలించవచ్చు. తద్వారా వచ్చే వ్యాధులకు అడ్డుకట్ట పడుతుంది. అన్ని ప్రభుత్వాసుపత్రులతో పాటు ఆరోగ్యశ్రీ ద్వారా డెంగీ జ్వరాలకు ఉచితంగా వైద్య సేవలను పొందవచ్చు. – డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ఆరోగ్యయోగం.. ఆనంద భాగ్యం



కడపలోని కోర్టు ఆవరణలో యోగా చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, న్యాయమూర్తులు



కడప స్పోర్ట్స్: యోగ ధ్యానం చేస్తున్న డీఈఓ ఎం. అనూరాధ



వైవీయూ: యోగా చేస్తున్న వైవీయూ వీసీ చింతా సుధాకర్ తదితరులు

జిల్లాలో యోగా చైతన్యం వెల్లివిరిసింది. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యాసంస్థల ఆవరణలు, క్రీడామైదానాలు యోగా విన్యాసాలతో కళకళలాడాయి. కడపలోని కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి యోగా సాధన చేశారు. కడప శంకరాపురంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి డీఈఓ ఎం. అనూరాధ పాల్గొని యోగా సాధన ప్రాముఖ్యత గురించి వివరించారు. యోగివేమన విశ్వవిద్యాలయంలోని క్రీడాశాస్త్ర విభాగం ఆవరణలో వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య యోగాసనాలు వేశారు. సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ యోగా చేయాలని వారు పిలుపునిచ్చారు.
-సాక్షి నెట్‌వర్క్



కమలాపురం: జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

పటిష్టమైనది భారతి సిమెంట్



ప్రమాద బీమా బాండ్లను అందిస్తున్న టెక్నికల్ ఇంజనీర్ నాగేంద్ర

ప్రొద్దుటూరు : అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైనది భారతి సిమెంట్ అని ఆ కంపెనీ జిల్లా టెక్నికల్ ఇంజనీర్ కె.నాగేంద్ర అన్నారు. స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని టేస్టీ స్పాట్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో శుక్రవారం తాపీ మేస్త్రీలకు సిమెంట్ నాణ్యత, వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సిమెంట్ రోబోటిక్, జర్మనీ టెక్నాలజీతో తయారవుతోందన్నారు. భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ మరింత నాణ్యత కలిగి ఉంటుందన్నారు. ఇతర రకం సిమెంట్ ఐదు గంటల్లో సెట్ అయితే భారతి అల్ట్రా ఫాస్ట్ 2 గంటల్లోనే సెట్ అవుతుందని తెలిపారు. ఈ సిమెంట్ చాలా దృఢత్వాన్ని కలిగి ఉంటుందని, కట్టడాలు త్వరగా పూర్తవుతాయన్నారు. 50 మంది మేస్త్రీలకు ఒక లక్ష రూపాయల ఉచిత బీమా బాండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, డీలర్ జాఫర్, ఆసీఫ్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం...
పశువులు భద్రం

- వర్షాకాలంలో జాగ్రత్తపడాలంటున్న పశు వైద్యులు
- గొంతు, జబ్బ వాపులకు టీకా వేయించాలని సూచన
- దోమల నుంచి పశువులకు రక్షణ అవసరం

పశు సంపద మానవులకు ఎన్నో విధాలుగా మేలు చేస్తుంటుంది. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. కాలం, వాతావరణాన్ని బట్టి మనుషుల లాగే పశువుల్లోనూ వ్యాధులు వస్తుంటాయి. ముఖ్యంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు, ఇతర వ్యాధుల బారి నుంచి జాగ్రత్త వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పశుపోషకులు అప్రమత్తంగా ఉండి తొలిదశలోనే వ్యాధులను గుర్తిస్తే నివారణ సులభమవుతుందని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. గొంతువాపు, జబ్బవాపు, దొమ్మ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉంటనే నివారణ సాధ్యమన్నారు.


గొంతువాపు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

పులివెందుల రూరల్ : వర్షాకాలం ప్రారంభమైందంటే చాలు మనుషులకే కాదు మూగ జీవాలకు వ్యాధుల ముప్పుతప్పదు. సూక్ష్మ జీవుల కారణంగా గొంతువాపు, జబ్బవాపు వంటి వ్యాధులు ప్రబలడంతోపాటు ఈగలు, దోమల దాడి పెరుగుతుంది. పాడి రైతులు ఈ సమస్య అధిగమించేందుకు తమ పశువులకు సకాలంలో వైద్య చికిత్స అందించాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. వర్షాలకు మొలిచే లేతగడ్డి మేసిన 15 నిమిషాలకే పశువులో వ్యాధి లక్షణాలు బయటపడతాయని.. చికిత్స చేయించకపోతే పశువు మత్యువాత పడే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. సాధ్యమైనంత వరకూ పాడి రైతులు పచ్చిక బయళ్లలోని లేత గడ్డి అతిగా మేపకుండా ఉండడమే మంచిదని చెబుతున్నారు. వ్యాధి లక్షణాలు కనబడిన వెంటనే చికిత్స అందించాలని సూచిస్తున్నారు.

జబ్బవాపు వ్యాధి

వయసులో ఉన్న ఆరోగ్యవంతమైన పశువుల్లోనూ, తెల్లజాతి పశువుల్లోనూ జబ్బవాపు వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. వ్యాధి సోకిన పశువు అధిక జ్వరంతో బాధపడుతూ మేత మేయక పడుకొని ఉంటుంది. జబ్బ భాగం వాచి, నల్లగా కములుతుంది. కండరాలు ఉబ్బుతాయి. వాటిలో గాలి బుడగలు, నీరు చేరి పశువు తీవ్ర నొప్పితో బాధపడుతుంది. ఆరు నెలల నుంచి మూడేళ్ల వయసు పశువులలో ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. క్లాస్ట్రీడియం బ్యాక్టీరియా కారణంగా ఈ వ్యాధి పశువులకు వస్తుంది. జ్వరం తీవ్రంగా ఉండడం, శ్వాస పెరగడం, కాలు కుంటడం, భుజం భాగాన వాపురావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి సోకినప్పుడు పశువులకు పెన్సిలిన్, యాంటిబయోటిక్స్ పెయిన్‌కిల్లర్ వంటి మందులు వాడాలి.

గొంతువాపు వ్యాధి

వర్షాకాలంలో పశువులకు సోకే ప్రాణాంతక వ్యాధుల్లో గొంతువాపు ఒకటి. ముఖ్యంగా వయసులో ఉన్న నల్లజాతి గేదెల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వ్యాధి సోకిన పశువుకు అకస్మాత్తుగా అధిక జ్వరం వస్తుంది. పశువు మేత మేయదు. గొంతుపైన, మెడ కింద వాపు కన్పిస్తుంది. పశువు ఆయాసపడుతూ శ్వాస పీల్చుకుంటుంది. ఆ సమయంలో గురక శబ్దం వస్తుంది. నోరు, ముక్కు నుంచి ద్రవం కారుతుంది. పశువు వణుకుతూ ఉంటుంది. దవడ మధ్యన, గొంతుపైన వాపు వస్తుంది. కళ్లు ఎర్రబడి నీరు కారుతుంది. పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. వ్యాధి తీవ్రత ఎక్కువైతే పశువు దగ్గుతూ, చివరికి అపస్మారక స్థితిలోకి వెళ్లి చనిపోతుంది. ఈ వ్యాధి సోకినప్పుడు వెంటనే పశువుకు చికిత్స అందించాలి.

అపరిశుభ్రత ఉండరాదు...

నేల చిత్తడిగా, వాతావరణం అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశంలో, నీరు నిల్వ ఉన్న గుంతల్లో, మురుగు కాల్వల్లో ఈగలు, దోమలు ఆవాసాన్ని ఏర్పాటు చేసుకుంటాయి. ఇవి ఆహారం కోసం పశువులను పట్టి పీడిస్తుంటాయి. వర్షాకాలంలో వీటి తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈగలు, దోమలు శరీరంపై వాలి రక్తాన్ని పీలుస్తాయి. వీటి తాకిడి కారణంగా పశువులు పడుకోలేవు. నిలబడలేవు. వాటిని వదిలించుకోవడానికి తోకను అటూ ఇటూ కొట్టుకుంటూ, చెవులు ఊపుతూ అసహనానికి గురవుతాయి. కడుపునిండా మేత మేయలేవు. ఫలితంగా పశువులు రక్త హీనతకు లోనవుతాయి. ఈగలు, దోమ కాటుతో పశువు శరీరంపై పుండ్లు పడతాయి. ఈగలు, దోమల నివారణకు నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో కిరోసిన్ పిచికారీ చేయాలి. మురుగు నీరు చేరే చోటు, చిత్తడి ప్రదేశాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో పశువుల పాకలో ఎండు పిడకలు, వేపాకుతో పొగబెట్టాలి. వైద్యుల సలహా మేరకు పశువు శరీరంపై కీటక నాశనులను పిచికారీ చేయాలి. సాయంకాలం వేళ పశువుల శరీరంపై వేపనూనె రాయాలి. సీజన్‌కి తగ్గట్టుగా టీకాలు వేయించాలి, మురుగు నీరు తాగించకుండా శుభ్రమైన నీటినే తాగించాలి. పశువుల షెడ్లు, పాకలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

కొండాపురం : మండలంలోని కొండాపురం నివాసముంటున్న బసిరెడ్డి వెంకటక్రిష్ణ(31) ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా తూర్పు యర్రబల్లె గ్రామానికి చెందిన బసిరెడ్డి వెంకటక్రిష్ణ కొండాపురంలో నివాసముంటూ బేల్దారి పనులు చేస్తున్నారు. ఈ నెల 16న లావనూరు గ్రామంలో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో వస్తుండగా డొంకపల్లె వద్ద ద్విచక్ర వాహనం టైర్ పంక్చరై స్కూటర్ అదుపు తప్పి కింద పడ్డాడు. అనంతపురం పట్టణంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి వివాహం కాలేదని, కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

యజమానికి మొబైల్ ఫోన్ అందజేత


ప్రయాణీకుడికి మొబైల్ ఫోన్ అందజేస్తున్న రైల్వే పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : చిత్తూరు–కాచిగూడ మధ్య నడుస్తున్న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ ప్రయాణీకుడు తన మొబైల్ ఫోన్‌ను గురువారం రాత్రి మరిచిపోయాడు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న టీటీఈ ఎలిజిబెత్‌రాణి ఫోన్ గుర్తించి దానిని ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులకు అప్పగించారు. శ్రీనివాసులు ఆ ఫోన్ పోగొట్టుకున్న ప్రయాణీకుడు శైలేంద్రసింగ్‌ను శుక్రవారం ఉదయం సంప్రదించి.. తమ వద్ద మొబైల్ ఉందని తెలియజేశారు. అనంతరం వచ్చిన ప్రయాణీకుడికి మొబైల్ ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా టీటీఈ ఎలిజిబెత్ రాణి, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ నాగభూషణం, కానిస్టేబుల్ సౌజన్యను సీఐ శ్రీనివాసులు అభినందించారు.

తప్పిన ప్రమాదం


విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న క్రేన్

అట్లూరు : అట్లూరు మండలం నబీఆబాద్ గ్రామ సమీపాన ఓ క్రేన్ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల మేరకు.. కడప–బద్వేలు రహదారి పక్కనే విద్యుత్తు లైన్ ఉంది. శుక్రవారం ఉదయం బద్వేల్ నుంచి కడప వెళ్తున్న ఓ క్రేన్ ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభం విరిగి క్రేన్ మీదనే పడింది. విద్యుత్తు సిబ్బంది సరఫరా నిలిపేసి క్రేన్ తొలగించారు.

ఘర్షణ కేసులో ఇద్దరి అరెస్టు

కడప అర్బన్ : కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ పార్క్ సమీపంలో ఈ నెల 19న రాత్రి జరిగిన ఘర్షణ కేసులో విష్ణువర్ధన్ అలియాస్ విష్ణు, నరసింహాచారి అలియాస్ నరసింహను ఇద్దరు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. రాజారెడ్డి వీధిలో సీఎస్ఐ గ్రౌండ్‌కు వెళ్లే దారిలో సీఐ భాస్కర్‌రెడ్డి, సిబ్బందితో కలిసి అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కడప అర్బన్ : కడప నగర శివారులోని గురుకుల పాఠశాల సమీపంలో ఆర్టీసీ బస్సు, కారును ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న రాజమోహన్ (58) శుక్రవారం మృతి చెందారు. ఈ సంఘటనలో రామయ్య, రాజమోహన్ కుమారుడైన గురు రోహిత్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రాజమోహన్, అతని భార్య లక్ష్మీదేవిలో ఒకరైన రాజమోహన్ మృతిచెందాడు. ఈ సంఘటనలో రాజమోహన్ మృతదేహానికి రిమ్స్ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ నారాయణ తెలియజేశారు.

అనుమానాస్పదంగా మరొకరు


మృతి చెందిన దూదేకుల హుసేన్

మైలవరం : మండలంలోని వద్దిరాల గ్రామంలో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. మృతుడు దూదేకుల హుసేన్‌వలి(34)పెద్దముడియం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్ఐ హనుమంత్ తెలిపారు. ఈ నెల 18న పనినిమిత్తం మండలంలోని గొల్లపల్లిలోని మునిరెడ్డి కంకర మిషన్ వద్ద జేసీబీ ఆపరేటర్‌గా పనిచేయడానికి వచ్చి శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మృతుడికి భార్య కరీమున్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనుమానాస్పదం గా ఉండటంతో విచారణ చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లె : ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సానిపాయి ఫారెస్ట్ రేంజర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున సానిపాయి బీటు కాల్బు బండ ప్రదేశంలో అక్రమంగా ఎర్రచందనం తరలించేందుకు సిద్ధంగా ఉన్న వారిని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. వారి వద్ద ఒక ద్విచక్ర వాహనం, ఆరు ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వాటి విలువ రూ.45,341లు ఉంటుందని, మరింత మంది గుర్తు తెలియని వ్యక్తులు పరారైనట్లు ఫారెస్ట్ రేంజర్ తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ


ఉద్యోగులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి జెడ్పీ చైర్ పర్సన్ శారద

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా కేంద్రంలోని అకౌంట్స్, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శారద శుక్రవారం తనిఖీ చేశారు. జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి ఆయా విభాగాల విధుల గురించి ఆమెకు వివరించారు. శాఖాపరంగా ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామన్నారు. జెడ్పీ ఉద్యోగులంతా సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి జెడ్పీ చైర్ పర్సన్‌ను ఆమె కోరారు.

విశ్వవిద్యాలయ కీర్తిని పెంచేలా పరిశోధనలు

– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం కీర్తిని పెంచేలా పరిశోధనలు సాగాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ సూచించారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమవడంతో వైవీయూ సెమినార్ హాల్‌లో అధ్యాపకులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ ఉచ్ఛతర శిక్ష అభియాన్ నుంచి రూ.3.5 కోట్ల నిధులతో 53 మందికి ప్రాజెక్టులు రావడంతో అధ్యాపకులను ఆయన అభినందించారు. తమ పరిశోధనల ప్రగతి చూసి జాతీయ సంస్థలు ఇంకా ప్రాజెక్టులు మంజూరు చేసే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్ పరిశోధకులైన స్కాలర్లకు ఆర్థిక సమస్యలు తీరుతాయన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్ విద్యార్థుల సమాధానపత్రాల మూల్యాంకనం పూర్తిచేసి ఫలితాలు వెంటనే విడుదల చేసేలా సహకరించాలన్నారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ రూసా ప్రాజెక్టులందుకున్న అధ్యాపకులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.రఘునాథ రెడ్డి, ఆచార్యులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

పెద్దమండ్యం : మండల సరిహద్దులో జూదమాడుతున్న ఎనిమిది మందిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ములకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధు తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పాపేపల్లె పంచాయతీ గొర్లవానికుంట సమీపంలో జూదమాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు. మదనపల్లె, సంబేపల్లె, ఎన్పికుంట, గోరాన్‌చెరువు ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది జూదరులు పట్టుబడగా, మరో నలుగురు పరారైనట్లు చెప్పారు. వారి నుంచి రూ.1.15లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా జూదం నిర్వహించినా, నాటుసారా విక్రయాలు జరిపినా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఆర్టీసీలో ద్వారకా తిరుమలరావు సేవలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఆర్టీసీ ఎండీగా నియమితులైన ద్వారకా తిరుమలరావు ఎన్నో సేవలందించారని ఆర్టీసీ యూనియన్ నాయకులు కేకే.కుమార్, బాబా ఫక్రుద్దీన్, శివారెడ్డి, పురుషోత్తం, నగినాల శ్రీనివాసులు, ఏఆర్ మూర్తి అన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ద్వారకా తిరుమలరావుకు వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ కారుణ్య నియామకాలకు ప్రభుత్వ అనుమతి పొంది ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. డ్రైవర్లు, కండక్టర్లకు ఓటీలు, నైట్ అవుట్ అలవెన్సు ఇప్పించడంలో ఆయన ఎంతో కృషి చేశారన్నారు. వారితోపాటు వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్, కార్మిక పరిషత్ నాయకులు విజయవాడలో డీజీపీని కలిసి ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలంలోని సీటీఎం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె పట్టణం మోతీ నగర్‌కు చెందిన షేక్ అఫ్రష్(21) సీటీఎం వద్దనున్న ఓ ఫార్మసీ కాలేజీలో చదువుతున్నాడు. కాలేజీ నుంచి ఇంటికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. సీటీఎం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో షేక్ అఫ్రష్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

వాటర్‌మెన్ ఆత్మహత్య

మదనపల్లె సిటీ : అప్పులిచ్చినవారి వేధింపులు తాళలేక ఓ వాటర్‌మెన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ రామాపురానికి చెందిన శ్రీనివాసులు (58) కుటుంబ అవసరాల కోసం అప్పు చేశాడు. ఈ క్రమంలో అప్పులిచ్చినవారు ఇంటి వద్దకు వచ్చి డబ్బు ఇవ్వాలని పట్టుపట్టారు. ఇవ్వకపోతే ఉద్యోగం తీయిస్తాయని బెదిరించారు. దీంతో మనస్థాపంతో పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య కాంతమ్మ, కుటుంబ సభ్యులు మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు జవసత్వాలు

జిల్లా కార్యదర్శిగా ప్రమీల, కోశాధికారిగా శివశంకర్‌రెడ్డి


ఎం. అనూరాధ


డి. ప్రమీల, కార్యదర్శి


బి. శివశంకర్‌రెడ్డి

కడప స్పోర్ట్స్ : జిల్లాలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు నూతన అధికారులను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్యాట్రన్‌గా, ప్రెసిడెంట్‌గా కలెక్టర్ వి.విజయరామరాజు, వైస్ ప్యాట్రన్‌లుగా ఎం.వి.రామచంద్రారెడ్డి (ఎంఎల్‌సీ), వైవీయూ వైస్ చాన్సలర్, కృషివిజ్ఞానకేంద్రం ప్రిన్సిపల్, కడప మున్సిపల్ కమిషనర్, జిల్లా ఎస్పీ వ్యవహరిస్తారు. వైస్ ప్రెసిడెంట్లుగా జేసీ జి.గణేష్ కుమార్, జెడ్పీ సీఈఓ డా.కె.లలిత, వైవీయూ సైకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, ఎన్.అరుణకుమారి, వ్యవహరిస్తారు. జిల్లా చీఫ్ కమిషనర్‌గా జిల్లా విద్యాశాఖాధికారి ఎం. అనూరాధ వ్యవహరిస్తారు. ఆమెతోపాటు నూతన జిల్లా కార్యదర్శిగా బద్వేలు ఎంఈఓ–2 డి.ప్రమీల, కోశాధికారిగా పెండ్లిమర్రి మండలం గంగనపల్లె ఫిజికల్ డైరెక్టర్ బి.శివశంకర్ రెడ్డిలను నియమించారు. జాయింట్ సెక్రటరీగా ఎం.వెంకటసుబ్బయ్య (ఎస్ఏ, జెడ్పీహెచ్ఎస్, చెన్నూరు), అసిస్టెంట్ సెక్రటరీగా బి.ఖాదర్‌బాషా(ఎస్ఏ జెడ్పీహెచ్ఎస్, కందిమల్లాయపల్లె, బి.మఠం)లను నియమించారు. ట్రైనింగ్ కమిటీ, బ్యాడ్జ్ కమిటీ, ఆర్గనైజింగ్ కమిటీలకు డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, ఫిజికల్ డైరెక్టర్లతో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.

వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించాలనడం తగదు

కడప కార్పొరేషన్ : యోగి వేమన విశ్వ విద్యాలయం ప్రాంగణంలోని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కోరడం దారుణమని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.సాయి దత్త అన్నారు. విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ యోగి వేమన యూనివర్సిటీలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆయన సేవలకు గుర్తుగా ఏర్పాటు చేశారన్నారు. 2004కు ముందు కేవలం పీజీ సెంటర్‌ను యోగి వేమన యూనివర్సిటీగా తీర్చిదిద్దిన ఘనత దివంగత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అక్కడి భవనాలను నిర్మించారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా విద్యా రంగానికి ఆయన చేసిన మేలు ఎవరూ మరవరాదన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఇలాంటి కక్షపూరిత రాజకీయాలతో యూనివర్సిటీలో పనిచేసే ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. పదహారు సంవత్సరాలుగా ఆ విగ్రహం అక్కడ ప్రతిష్ఠించబడి ఉందని, దానిని తొలగించాలని చూస్తే వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ సహించదన్నారు. ఒకప్పుడు వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన వ్యక్తే నేడు విగ్రహాన్ని తొలగించాలని వినతిపత్రం ఇవ్వడం శోచనీయమన్నారు. ఎన్ని పోరాటాలు చేసైనా సరే వైఎస్సార్ విగ్రహాన్ని అలాగే నిలుపుకొంమని తెలిపారు.

ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి

ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అద్దె బస్సుల్లో పని చేస్తున్న డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగువెంకటేశ్వరరావు సూచించారు. కడప ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో అద్దె బస్సు డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళ, శుక్ర వారాల్లో కడప డీపీటీఓ కార్యాలయంలో ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు, కడప, పులివెందుల, జమ్మలమడుగు డిపోల నుంచి ఇద్దరు, ముగ్గురు చొప్పున అద్దె బస్సు డ్రైవర్లకు రక్షణాత్మక శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రయాణీకులను గౌరవిస్తే సంస్థపై వారికి మంచి అభిప్రాయం ఉంటుందని సూచించారు. రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు డ్రైవర్లకు ప్రమాణ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఓం శాంతి యోగా గురువు ఓబయ్య డ్రైవర్లతో యోగ ఆసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో డీపీటీఓ పాలిమేర గోపాల్‌రెడ్డి, కార్గో మేనేజర్ హరి, డిపో మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

అతిసార నియంత్రణకు చర్యలు


వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, ఇతర అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : వైఎస్సార్ జిల్లాను అతిసారం రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ విజయ రామరాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి అతిసార కేసుల వ్యాప్తి, నియంత్రణ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్షించారు. కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసి, అతిసారం కేసులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించుకోవాలని, వర్క్‌షాపులు, డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించాలని తెలిపారు. చిన్నారులకు జింక్ ప్యాకెట్లు అందించాలన్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీలలో పారిశుద్ధ్య పరిరక్షణా చర్యలు చేపట్టాలన్నారు. తక్కువ బరువున్న పిల్లలకు పోషకాహారం అందించాలన్నారు. అనుబంధ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.